

ఆదివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును యుగ తులసి చైర్మన్ కే శివకుమార్, కే శైలజ దంపతులు కలిశారు. గో రక్షణపై సుదీర్ఘంగా చర్చించి వినతిపత్రం అందజేశారు. గో సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

# కర్ణాటకలో కరెంటే దిక్కులేదు

- కాంగ్రెసోళ్లు ఇక్కడ ఏం చేస్తారు?
- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

కోటగిరి, అక్టోబర్ 22: కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్తున్నారని బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఇటీవలే కర్ణాటకలో మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చారని.. ప్రస్తుతం అక్కడ కరెంటుకే దిక్కు లేదని అన్నారు. నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం జల్లాపల్లి అబాదిలో ఆదివారం నిర్వహించిన సేవాలాల్, జగదాంబ మాత ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా తనను ఆశీర్వదించాలని కోరారు. తెలంగాణ వచ్చిన తర్వాతే గ్రామాలు, తండాల అభివృద్ధికి పుష్కలంగా నిధులు వస్తున్నాయని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించినందుకు అక్కడి ప్రజలు ప్రస్తుతం నానా ఇబ్బందులు పడుతున్నారని, ఇక్కడ కూడా కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మొద్దని సూచించారు. తెలంగాణ అభివృద్ధి కొనసాగాలంటే సీఎంగా కేసీఆర్ ఉండాలె.. ఇక్కడ పోచారం ఉండాలె అని పేర్కొన్నారు.



ఆదివారం జల్లాపల్లి అబాదిలో సేవాలాల్, జగదాంబ మాత ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

## రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు దుర్మరణం

- పండుగ కోసం కూతురు, అల్లుడిని తీసుకొస్తుండగా ఘటన

రాయపర్తి, అక్టోబర్ 22: పండుగ కోసం ఓ తండ్రి తన కూతురు, అల్లుడిని బైక్‌పై ఇంటికి తీసుకొస్తుండగా రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు దుర్మరణం చెందారు. ఈ ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. మొరిపిరాలకు చెందిన ఓరుగంటి వెంకన్న (49).. దసరా పండుగ కోసం హైదరాబాద్‌లో ఉంటున్న చిన్న కూతురు ముంజంపల్లి అనూష (28), అల్లుడు రాజును బైక్‌పై తీసుకొస్తున్నాడు. కిష్టాపురం క్రాస్ రోడ్డు సమీపంలో ఓ వ్యక్తి కారుతో వెంకన్న బైక్‌ను వెనక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకన్నతోపాటు కుమార్తె అనూష అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ రాజును స్థానికులు 108 వాహనంలో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అనూషకు మూడేండ్ల కుమారుడు ఉండగా, ప్రస్తుతం ఆమె నాలుగు నెలల గర్భిణి.



ఆదివారం వనపర్తిలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో సీనియర్ నాయకుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి

## కాంగ్రెస్ నాయకులది మోసాల చరిత్ర

- పేరుకు జాతీయ పార్టీ.. ఒక్కోచోట ఒక్కో విధానం
- మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- మళ్లీ నిరంజన్‌రెడ్డిని గెలిపించుకుంటాం : రావుల


వనపర్తి, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ నాయకులు జీవితకాలమంతా మోసాలే చేస్తుంటారని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం వనపర్తిలోని బీఆర్ఎస్ భవన్‌లో సీనియర్ నాయకుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మంత్రి నిరంజన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. దేశంలోనే తెలంగాణ తలసరి ఆదాయంలో నంబర్‌వన్ స్థానంలో ఉన్నదని, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాల్లోనూ తెలంగాణ కంటే తక్కువే ఉన్నదని అన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టులన్నీ 30 నుంచి 40 ఏండ్లయినా పూర్తయ్యేవి కావని.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాళేశ్వరం వంటి అతిభారీ ప్రాజెక్టును కేవలం మూడున్నరేండ్లలోనే పూర్తి చేసినట్టు వివరించారు. ఏ రాష్ట్రంలోనూ తెలంగాణ మాదిరిగా రైతులు, వ్యవసాయం కోసం ఖర్చు చేయడం లేదని చెప్పారు. ఒక్క మన రాష్ట్రంలోనే రూ.నాలుగున్నర లక్షల కోట్లను వెచ్చించినట్టు తెలిపారు. జాతీయ పార్టీ అని చెప్పుకొనే కాంగ్రెస్ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానాన్ని అనుసరిస్తున్నదని విమర్శించారు. ప్రాంతీయ పార్టీలాగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అనంతరం రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. వనపర్తిలో మంత్రి నిరంజన్‌రెడ్డి అనేక అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. చేసిన అభివృద్ధిని ప్రజల ముందుంచుతామని, మరోసారి నిరంజన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.

# ఎన్నికల్లో గులాబీ పార్టీదే హవా

**ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 22: రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ఎంతో బలగం ఉన్నదని.. ఈ ఎన్నికల్లో గులాబీ పార్టీదే హవా కొనసాగుతుందని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ బీఆర్ఎస్ బూత్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏ పార్టీకి లేనంత మంది కార్యకర్తలున్న పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసే వరకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీని అందించే దిశగా కృషి చేయాలని సూచించారు. బీఆర్ఎస్ అంటేనే అభివృద్ధికి చిరునామా అని.. పదేండ్లలో మహబూబ్‌నగర్‌లో జరిగిన పనులే ఇందుకు నిదర్శనమని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజల వద్దకు వచ్చే పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.





**అడెల్లిలో గంగనీళ్ల జాతర**

నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అడెల్లిలో గంగనీళ్ల జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. దిలావర్‌పూర్ నుంచి అడెల్లి వరకు ఊరేగింపుగా వెళ్లిన భక్తులు మహాపోచమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. – నిర్మల్ అర్బన్



తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

## బీఆర్ఎస్‌కు ఆడబిడ్డల ఆశీస్సులుండాలి


**రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్**

తిమ్మాపూర్, అక్టోబర్ 22: మహిళా సంక్షేమానికి పాటుపడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావాలంటే ఆడబిడ్డల ఆశీస్సులుండాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. ఆదివారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి వినోద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉన్న అభివృద్ధికి, ఇప్పటికి తేడా వివరించారు. మార్పును ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. యువతకు అన్ని విధాలుగా అండగా ఉండేది తెలంగాణ ప్రభుత్వమేనని చెప్పారు. రసమయి బాలకిషన్ గెలుపు కోసం యువత పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని ఆడబిడ్డలను కోరారు. బీఆర్ఎస్ నాయకుడు సిరికొండ అంజన్‌రావు ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు.




# ఇల్లు కడతారా?

## వీటిని గమనించండి



**సొంతిల్లు** అనేది ప్రతీ ఒక్కరి కల. ఆ కలను సాకారం చేసుకునేందుకు ఎంత కష్టమైనా పడుతాం.. మరెంత బరువైనా మోస్తాం. అయితే ఇల్లు కట్టేటప్పుడు కొన్నింటిపై అవగాహన ఉండాలి. లేకపోతే తలకు మించిన భారమే అవుతుందనడంలో సందేహం లేదు. కాబట్టి సరైన ప్రణాళికతో ముందుకెళ్తే లక్ష్య సాధన కూడా సులువవుతుంది మరి.

### బడ్జెట్ ప్లానింగ్

భూమి కొనుగోలు, ఆపై అందులో ఇంటి నిర్మాణం, దానికి కావాల్సిన అనుమతులు, కూలీల ఖర్చు, ఇంటీరియర్ ఫర్నీషింగ్స్ తదితరాలన్నింటికి అయ్యే ఖర్చును ముందే లెక్కించుకోవాలి. ప్రస్తుతం మార్కెట్‌లో దేనికెంత వ్యయం అవుతుందన్నది తెలుసుకుని బడ్జెట్ వేసుకుంటే తర్వాత ఎటువంటి ఇబ్బందులూ ఉండవు. ఆకస్మిక మార్పులేమైనా చేయాల్సి వస్తే దానికయ్యే వ్యయానికీ బడ్జెట్‌లో కేటాయించుకోవడం ఉత్తమం.

### నిధుల సమీకరణ

బడ్జెట్ పూర్తయితే.. నిధుల సమీకరణపై దృష్టి పెట్టాలి. ఇప్పటిదాకా దాచుకున్నది ఎంత? మనకున్న ఆదాయ మార్గాలు, వ్యయాలు ఏమిటి? అన్నది చూసుకోవాలి. వీలైతే బంగారం, ఇతరత్రా ఆస్తులను తీసేస్తే లాభమా? నష్టమా? అన్నదానిపైనా కుటుంబ సభ్యులతో కలిసి చర్చించి ఓ నిర్ణయానికి రండి. ఇలా మొత్తం ఆర్థిక పరిస్థితిపై ఓ అంచనాకు వచ్చిన తర్వాత.. రుణాల సాధ్యాసాధ్యాలపై ఆలోచించాలి. ఎడాపెడా అప్పులు చేసినా వాటిని తీర్చలేక మొదటికే మోసం వచ్చే ప్రమాదముంటుందని గుర్తుంచుకోవాలి.

### నిర్మాణ శైలి

ఇంటి నిర్మాణ శైలి, మెటీరియల్ ఎంపిక సైతం కీలకమే. ఖర్చును పెంచడంలో, తగ్గించడంలో ఇవి అంత ముఖ్యపాత్ర పోషిస్తాయి మరి. వీలైనంత వరకు హంగులు, ఆర్భాటాలకు వెళ్లకపోవడమే మంచిది. అవసరమైతే తప్ప గృహ నిర్మాణంలో దేన్ని భాగం చేయవద్దు. ఫ్లోరింగ్, ఫిట్టింగ్స్ వంటివి మీ బడ్జెట్‌కు తగ్గట్టుగా ఎంపిక చేసుకోవచ్చు. ఎల్ఈడీ లైటింగ్, సోలార్ ప్యానెల్స్ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వండి. నాణ్యమైన విద్యుత్తు వైరింగ్‌తో పాటు వెంటిలేషన్‌కు పెద్దపీట వేయండి. వీటివల్ల కరెంట్ చార్జీలను తగ్గించుకోవచ్చు.

### కాంట్రాక్టర్ ఎంపిక

నమ్మకమైన కాంట్రాక్టర్‌ను ఎంచుకోవడం చాలాచాలా ప్రధానం. అనుకున్న సమయానికి మీ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయడంలో కాంట్రాక్టర్‌దే కీలకపాత్ర. కాబట్టి ఈ విషయంలో అనుభవజ్ఞులు, మీ బంధువులు, స్నేహితులు, ఇరుగు పొరుగువారి సలహాలు, సూచనలు తీసుకోవచ్చు. వ్యయం, నాణ్యత విషయంలో క్రమశిక్షణ ఉండాలి. లీగల్‌గా కూడా కచ్చితత్వం కనిపించాలి.


### పన్ను ప్రోత్సాహకాలు

గృహ నిర్మాణానికయ్యే ఖర్చుల్లో పన్ను మినహాయింపుల కిందకేమైనా వస్తాయా? అన్నదీ చూసుకోవాలి. మొదటిసారిగా ఇల్లు కడుతున్నవారికి ప్రభుత్వం నుంచి ఏమైనా సాయం వస్తుందా? అన్నదీ పరిశీలించాలి. వడ్డీరేట్ల తగ్గింపు, ఇతరత్రా పథకాల వర్తింపునకున్న అవకాశాలనూ అందిపుచ్చుకోవడం మంచిది.

### చివరగా..

*మీరు ఇల్లు నిర్మించాలనుకునే చోటు అన్నివిధాలా మీకు సరైనదేనా? అన్నది ఒకటికి రెండుసార్లు ఆలోచించండి. భవిష్యత్తులో అక్కడ ధరలు పెరుగుతాయన్న కోణంలోనేగాక, ప్రశాంతతకూ ప్రాధాన్యం ఇవ్వండి. ముంపు ప్రాంతాలు, లిటిగేషన్ ల్యాండ్లుంటే ఆరా తీయండి. ఇక ఆర్థిక ఇబ్బందులేవైనా ఉంటే అవి తీరాకే గృహ నిర్మాణం మొదలు పెట్టండి. లేకపోతే మధ్యలో ఆగిపోయే ప్రమాదం ఉంటుంది. అప్పుడు కొత్త సమస్యల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.*

# ఆర్థిక లక్ష్యాల సాధనకు ఐదు సూత్రాలు




**ఆశయం** లేని జీవితం.. అర్థవంతంగా ఉండదు. అలాగే ఆర్థిక లక్ష్యాల సాధనకు క్రమశిక్షణతో కూడిన ప్రణాళికలు ఉండాల్సిందే. లేకపోతే గురితప్పి దారీతెన్నూలేని అగాథంలో పడిపోతాం. నిజానికి నేటి యువత ఆరంభంలోనే ఆకర్షణీయ జీతాలను అందుకుంటున్నది. ఈ క్రమంలో భవిష్యత్తుపై పెద్దపెద్ద ఆశల్నే పెట్టుకుంటున్నది. అయితే అవగాహన లేక ఎంతోమంది తమ లక్ష్య సాధనలో మధ్యలోనే నీరసించి ఆగిపోతున్నారు. అలాంటివారంతా ఓ నిర్దిష్ట పద్ధతిలో ముందుకెళ్తే అనుకున్నది సాధించి విజేతలుగా నిలవడం సాధ్యమే. అందుకే ఈ ఐదు సూత్రాలను పాటించి ఆనందమయ జీవితానికి చేరువవ్వండి.

### జీవిత-ఆరోగ్య బీమా

ప్రతీ మనిషికి బీమా ఎంతో అవసరం. ఒకప్పుడు జీవిత బీమాకే ప్రాధాన్యం ఉండేది. కానీ ఇప్పుడు ఆరోగ్య బీమాకూ అవసరం పెరిగింది. కనుక తమతమ ఆర్థిక లక్ష్యాల సాధనలో అందరికీ బీమా ధీమా ఉండాల్సిందే. కుటుంబానికి ఆధారమైనవారు అర్ధాంతరంగా తనువు చాలిస్తే.. ఆ కుటుంబ సభ్యులు ఒక్కసారిగా సంక్షోభంలో పడ్డట్టే. అటువంటి పరిస్థితుల్లో దన్నుగా నిలిచేది జీవిత బీమా ద్వారా వచ్చే ధనమే. ఇక ఇటీవలికాలంలో ఎప్పుడు ఎవరి ఆరోగ్యం ఎలా ఉంటుందో తెలియని దుస్థితి నెలకొన్నది. ముఖ్యంగా కరోనా వచ్చిన దగ్గర్నుంచి పరిస్థితులు తలకిందులైపోయాయి. దవాఖానల్లో వైద్య ఖర్చుల కోసం ఉన్నదంతా ఊడ్చేయాల్సి వస్తున్నదన్నా అతిశయోక్తి కాదు. అందుకే ఆరోగ్య బీమా అనేది ఎవరికైనా తప్పనిసరి. తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనం బీమాతోనే సాధ్యం.

### మెరుగైన ఆదాయం

ఆదాయ మార్గాలను ఎప్పటికప్పుడు పెంచుకుంటూపోవాలి. ఉద్యోగాలైనా.. వ్యాపారాలైనా.. స్థిరంగా సాగని రోజులివి. అందుకే ప్రతి ఒక్కరూ తమ ఆదాయానికి ప్రత్యామ్నాయ మార్గాలను కలిగి ఉండటం తెలివైనదిగానే చెప్పుకోవచ్చు. రేపన్నది ఎలా ఉంటుందో తెలియదు. అందుకే మీరు సంపాదించగలిగినప్పుడే నాలుగు రూపాయలు ఎక్కువగా సంపాదించుకోవాలి. అలాగని శక్తికి మించిన భారాన్ని మోయవద్దు. దీనివల్ల ఆరోగ్యపరంగా, మానసికంగా అనేక సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి మీకు వీలున్నంత మేరకే కష్టించి కూడబెట్టుకోండి. అవకాశం ఉన్నప్పటికీ ఒక్క ఆదాయ వనరుతోనే సరిపెట్టుకోవడం సరికాదు. వీలైతే మీ భాగస్వాముల నుంచీ తగిన మద్దతును అందిపుచ్చుకోండి.

### పొదుపు-పెట్టుబడులు

పొదుపు-పెట్టుబడులు సజావుగా సాగినప్పుడే జీవితంలో ఆర్థికపరంగా ఆకర్షణీయమైన వృద్ధిని అందుకోగలం. సేవింగ్స్ ఎంత ముఖ్యమో.. ఇన్వెస్ట్‌మెంట్స్ కూడా అంతే ప్రాధాన్యమని గుర్తించాలి. ఎక్కడ? ఎలా? పొదుపు చేస్తే అధిక రాబడులను అందుకుంటామో చూసుకొని ముందుకెళ్లండి. అలాగే పెట్టుబడులు ఏ రంగంలో పెడితే ఇంకా పెరుగుతాయో అన్వేషించండి. ఈక్విటీ మార్కెట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సావరిన్ గోల్డ్ బాండ్లు, మ్యూచువల్ ఫండ్స్ ఇలా ఇప్పుడు ఎన్నో అవకాశాలున్నాయి. నిపుణుల సలహాతో ముందుకెళ్తే లాభాలను అందుకోవడం మరింత సులభం. అధిక రాబడులు వస్తాయని మోసపూరిత స్కీముల్లో పెట్టుబడులు పెట్టకండి. సొంతింటి కల సాకారమయ్యేందుకు అనువైన పెట్టుబడులను ఎంచుకోవడం ఉత్తమం.

### రిటైర్మెంట్ ప్రణాళిక

ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ రిటైర్మెంట్ ఫండ్‌ను సిద్ధం చేసుకుంటే శేష జీవితం హాయిగా గడుస్తుంది. వివిధ రిటైర్మెంట్ పథకాలను పరిశీలించవచ్చు. చిన్న వయసులోనే ఈ స్కీముల్లో చేరితే ఎక్కువ పెన్షన్లను అందుకోవచ్చు.


### అత్యవసర నిధి

ఏ సమస్య ఎలా వస్తుందో చెప్పడం కష్టం. తక్షణ అవసరాలను తీర్చుకోవడానికి అత్యవసర నిధి కావాలి. కనీసం 6 నెలల అవసరాలు తీరేలా ఉండాలిది. ఉద్యోగం, ఆదాయ మార్గాన్ని కోల్పోయినప్పుడు ఈ నిధి అండగా ఉంటుంది.

# ఈ బ్యాంక్ ఎఫ్‌డీపై 9.5% వడ్డీరేటు

## సీనియర్ సిటిజన్లకు సదవకాశం






**రిస్క్** లేకుండా నిలకడైన ఆదాయాన్ని కోరుకునేవాళ్ల తొలి ఎంపిక ఫిక్స్‌డ్ డిపాజిట్లే (ఎఫ్‌డీ)నన్న విషయం తెలిసిందే. అందుకే ఈ మధ్య బ్యాంకర్లు.. డిపాజిట్‌దారులను ఆకట్టుకోవడానికి ఎఫ్‌డీలపై ఆకర్షణీయ వడ్డీరేట్లనే ప్రకటిస్తున్నారు. ఈ వరుసలోకి యునిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఎస్ఎఫ్‌బీ) సైతం వచ్చింది. రూ.2 కోట్లలోపు ఎఫ్‌డీలపై ఇటీవలే బ్యాంక్ తమ వడ్డీరేట్లను సవరించింది. ఈ క్రమంలోనే ఆయా కాలపరిమితులపై గరిష్ఠంగా 9.5 శాతం వరకు వార్షిక వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నది. ఈ నెల 9 నుంచే కొత్త వడ్డీరేట్లు అమల్లోకి వచ్చాయి. 701 రోజులు కాలపరిమితి కలిగిన ఎఫ్‌డీపై సీనియర్ సిటిజన్లకు 9.45 శాతం వార్షిక వడ్డీరేటున్నది. సాధారణ డిపాజిట్‌దారులకు ఇది 8.95 శాతమే. అలాగే 7 రోజులు నుంచి పదేండ్ల వరకు మెచ్యూరిటీ అయ్యే వివిధ మొత్తాల డిపాజిట్లపై 4.50 శాతం నుంచి 9 శాతం వరకు వడ్డీరేట్లున్నాయి. ఇవి జనరల్ పబ్లిక్‌కు వర్తిస్తాయి. సీనియర్ సిటిజన్లకైతే కనిష్ఠంగా 4.50 శాతం, గరిష్ఠంగా 9.5 శాతం వడ్డీరేటు ఉన్నది. 1,001 రోజుల ఎఫ్‌డీపై సాధారణ డిపాజిటర్లు 9 శాతం, సీనియర్ సిటిజన్లు 9.5 శాతం వడ్డీరేటు పొందవచ్చు. 181-201 రోజులు, 501 రోజులకుగాను సీనియర్ సిటిజన్లకు 9.25 శాతం వడ్డీరేటున్నది. సాధారణ మదుపరులకు 8.75 శాతమే. కాగా, నిర్ణీత కాలపరిమితి ముగియకుండానే ముందస్తుగా ఉపసంహరించుకునే ఎఫ్‌డీలు, రికరింగ్ డిపాజిట్లపై ప్రీమెచ్యూర్ పెనాల్టీ ఒక శాతంగా ఉన్నది. ఇక సేవింగ్స్ ఖాతా వడ్డీరేట్లు లక్ష రూపాయల వరకు 6 శాతంగా, ఆపైన 7 శాతంగా ఉన్నాయి.

**మార్కెట్ పల్స్**

# ఒడిదుడుకుల్లో..

**కఠిన** ద్రవ్య విధానం కొనసాగుతుందంటూ యూఎస్ ఫెడ్ ప్రెసిడెంట్ జెరోమ్ పావెల్ ప్రకటించడం, ఇజ్రాయిల్-హమాస్ యుద్ధం తీవ్రతరం కావడంతో గతవారం ఎన్ఎస్ఈ నిఫ్టీ గరిష్ఠస్థాయిలో స్థిరపడలేకపోయింది. వారం మొత్తంమీద 208 పాయింట్లు నష్టపోయి 19,543 పాయింట్ల వద్ద ముగిసింది. రాజకీయ భౌగోళిక పరిస్థితులు, అంతర్జాతీయ సంకేతాలు మార్కెట్‌కు అనుకూలంగా లేవని, వచ్చే కొద్ది రోజుల్లో ఏ మాత్రం రికవరీ వచ్చినా అమ్మకాల ఒత్తిడి ఏర్పడుతుందని యాక్సిస్ సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ రాజేశ్ పాల్వియా అభిప్రాయం వ్యక్తం చేశారు. నిఫ్టీ 50 డీఎంఏ దిగువకు పడిపోయినందున, ట్రెండ్ నెగిటివ్‌గానే ఉంటుందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ రూపక్ డే అంచనా వేశారు.

### కీలక మద్దతు 19,500

ఈ వారం నిఫ్టీకి 19,500 స్థాయివద్దనున్న మద్దతు కీలకమైనదని, ఈ స్థాయిని కోల్పోతే తదుపరి రోజుల్లో 19,150-19,000 శ్రేణి వరకూ పతనమయ్యే అవకాశం ఉందని రూపక్ డే విశ్లేషించారు. 19,600-19,650 శ్రేణి వద్ద గట్టి నిరోధం ఉన్నదని, 19,650 స్థాయిపైకి చేరితే షార్ట్ కవరింగ్ ర్యాలీ జరుగుతుందని అంచనా వేశారు. భారీ పుట్ రైటింగ్ జరిగిన 19,500 ప్రధాన మద్దతు స్థాయిని వదులుకుంటే తాజా షార్ట్స్ క్రియేట్ అవుతాయని, 19,600 స్థాయి వద్ద కాల్ రైటింగ్ జోరుగా జరిగినందున ఈ స్థాయి సూచికి అవరోధం కల్పిస్తుందని సామ్కో సెక్యూరిటీస్ సీఈవో జిమిత్ మోది తెలిపారు.

